క్లుప్తంగా

సార్వత్రిక ఎన్నికలకు బీజేపీ సిద్ధం



కడియపులంకలో పర్యటిస్తున్న సోము వీర్రాజు

కడియం: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. మండలంలోని కడియపులంకలో శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సోము ఇంటింటికీ ఆ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను వివరించారు. అంతకు ముందు బూత్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పొత్తు, సీట్ల విషయం తమ పార్టీ పార్లమెంటరీ బోర్డు ప్రకటిస్తుందన్నారు. కార్యక్రమంలో నాగులపల్లి వీరబాబు, కొటికలపూడి వెంకటేశ్వరరావు, బొరుసు సుబ్రహ్మణ్యం, ఆకుల శ్రీధర్, గారపాటి తాతబ్బాయి పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: బొమ్మూరులోని 220 కేవీ విద్యుత్ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ ఆల్కాట్ గార్డెన్స్, శంభూనగర్, టి.నగర్, ఇన్నీసుపేట, కొత్తపేట, మంగళవారపు పేట, మెయిన్ రోడ్, డీలక్స్ సెంటర్, శ్యామల సెంటర్, టౌన్ హాల్ రోడ్డు, సీటీఎం మార్కెట్, చర్చిపేట, తాడితోట ఇండస్ట్రియల్ కాలనీ, రెల్లి పేట, ఆంధ్ర నగర్, గోరక్షణ పేట, పాత సోమాలమ్మ గుడి వీధి, దానవాయిపేట, ప్రకాష్ నగర్, తిలక్ రోడ్డు, వీఎల్ పురం, మార్గాని ఎస్టేట్స్, రామాలయం సెంటర్, పోస్టల్ కాలనీ, శ్యామలా నగర్, వెంకటేశ్వర జనరల్ మార్కెట్, ఆవ వాంబే కాలనీ, తూర్పు రైల్వే స్టేషన్ రోడ్డు, బాలాజీ పేట, ధవళేశ్వరం, బొమ్మూరులో విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

పీవీ సేవలు చిరస్మరణీయం

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మద్దూరి అన్నపూర్ణయ్య సేవా సమితి ప్రధాన కార్యదర్శి బెజవాడ రంగారావు కొనియాడారు. ఆయనకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానిక గోదావరి బండ్‌పై గల పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి రవి ప్రకాష్, పిల్లాడి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆధునిక బోధనా పద్ధతులు అలవరచుకోవాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉపాధ్యాయులు ఆధునిక బోధనా పద్ధతులలో మెళకువలు నేర్చుకుని, ఆసక్తికర తరగతిని రూపొందించాలని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న స్టెప్ శిక్షణ తరగతులను ఆయన శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పాఠశాల విద్య కమిషనర్ సూచనల మేరకు ది హిందూ గ్రూప్ నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువతకు సాంకేతికతతో కూడిన ఆంగ్ల భాషా మూల్యాంకనంపై ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు అందజేసిన ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డులను సమర్థంగా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని 19 మండలాల నుంచి 40 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

- మంత్రి వేణు
- ధవళేశ్వరంలో పర్యటన



ధవళేశ్వరం లక్ష్మీ జనార్దనస్వామి కాలనీలో పర్యటిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

ధవళేశ్వరం: పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమ రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన ధవళేశ్వరంలో సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక లక్ష్మీజనార్దనస్వామి, ఐటీసీఎల్ కాలనీలలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్యం, డ్రైనేజీలు, వీధిలైట్లు తదితర వాటికి సంబంధించి ఎటువంటి సమస్యలు ఉండకూడదని అధికారులకు ఆదేశించారు. శ్రీలక్ష్మీ జనార్దనస్వామి కాలనీలో పారిశుధ్య నిర్వహణకు అదనపు సిబ్బందిని తీసుకుని యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాసరావు, ఆర్‌ఐ సాగర్, వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్ (శివ), గరగ శ్రీనివాసరావు, గోలి దేవకుమార్, పేర్ల బాసి, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, దేవులపల్లి సరితారాణి, పేరాబత్తుల శ్రీదేవి, చప్పిడి జ్యోతి, పసుపులేటి దేవి, పట్టపగలు వెంకటలక్ష్మి, బర్రి కామేశ్వరరావు, దాసరి ధర్మ, మద్దాల బాబీ పాల్గొన్నారు.

జీసీటీఏ అధ్యాపకుల సంఘ సమావేశం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో శనివారం జీసీటీఏ అధ్యాపకుల సంఘం రాష్ట్ర స్థాయి కార్యనిర్వాహక సమావేశం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ అధ్యాపకులు కొత్తగా వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకుని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. క్షేత్రస్థాయి పరిశోధనలకు పునరంకితం కావాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎం.శ్యాంబాబు మాట్లాడుతూ అధ్యాపకులకు త్వరలోనే సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలని, సీఏఎస్ ప్రాసెస్ కూడా మొదలు పెట్టాలని ఉన్నత విద్యాశాఖను కోరుతున్నట్లు తీర్మానించడమైందన్నారు. సంఘ బైలాస్, సంఘ సభ్యత్వం, ఎన్నికలపై చర్చించారు. కార్యక్రమంలో జీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.రాఘవరావు, మహిళా కార్యదర్శి డాక్టర్ పి.లలితా శరణ్య, వివిధ జిల్లాల నుంచి వచ్చిన అధ్యాపకులు పాల్గొన్నారు.

చదువుకు ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: నగరపాలకసంస్థ పరిధి 20వ డివిజన్‌కు చెందిన పవన్ కుమార్ అనే ప్రైవేటు ఉద్యోగికి ఆయన కుమారుల చదువు కోసం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఆర్థిక సాయం చేశారు. తన కార్యాలయంలో శనివారం రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ దంపతులు చందనకు కృతజ్ఞతలు తెలిపారు.

అత్యాశతోనే కాంగ్రెస్, ప్రజారాజ్యం కనుమరుగు

- ఎన్టీఆర్ ఆశయాలను తుంగలో తొక్కిన చంద్రబాబు
- ధ్వజమెత్తిన మంత్రి వేణు



మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: కాంగ్రెస్, ప్రజారాజ్యం పార్టీలు అత్యాశ కారణంగానే కనుమరుగయ్యాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శించారు. తన నివాసంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య సాధన కోసం పుట్టిన కాంగ్రెస్‌లో ఇప్పుడు ఆశయాలు లేవన్నారు. ఆ పార్టీ నాయకుల అత్యాశ వల్ల దెబ్బతిందన్నారు. 2008లో తమ సామాజికవర్గ రాజ్యాధికార కోసం చిరంజీవి ప్రజారాజ్యం పెట్టారని, రాజకీయంగా కాపులు ఎదగాలని ఆశపడ్డారన్నారు. అయితే ఆయన ఆశయం అత్యాశగా మారి, కాంగ్రెస్‌లో విలీనం చేయడం వల్ల ఆ పార్టీ కనుమరుగైందన్నారు. తెలుగువాడి ఆత్మగౌరవం కోసం నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ పెడితే, కాంగ్రెస్ నుంచి వచ్చిన చంద్రబాబు నాయుడు దాన్ని లాక్కుని, ఎన్టీఆర్ ఆశయాలను తుంగలోకి తొక్కారన్నారు. తన కొడుకు లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్న అత్యాశతో దొడ్డిదారిన మంత్రిని చేసి మూడు శాఖలు అప్పగించారని ఆరోపించారు. అన్ని శాఖలలో స్కామ్‌లకు పాల్పడ్డారని విమర్శించారు. చిరంజీవి వారసుడిగా ప్రశ్నించడానికి రాజకీయాల్లోకి వస్తున్నానని చెప్పిన వచ్చిన పవన్ కల్యాణ్ 2014లో చంద్రబాబుకు మద్దతు ఇవ్వడం వల్ల కాపులు నష్టపోయారన్నారు. రిజర్వేషన్లను అడిగి, పోరాటం చేసిన ముద్రగడ పద్మనాభం, ఆయన కుటుంబాన్ని చంద్రబాబు చిత్రహింసలకు గురి చేశారని మంత్రి వేణు అన్నారు.

15న ఇన్‌స్పైర్ సైన్స్ ప్రదర్శన

కంబాలచెరువు: లలితా నగర్‌లోని సీజీటీఎం ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఈనెల 15న ఇన్‌స్పైర్ సైన్స్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) కె.వాసుదేవరావు తెలిపారు. ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టులను ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సీజీటీఎం ఇంగ్లిష్ మీడియం స్కూల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రాజమహేంద్రవరం ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్‌నారాయణ ఆ స్కూల్లో ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారన్నారు. ఇన్‌స్పైర్ ప్రదర్శన కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ, రూరల్ ఎంఈవో ఏ.దుర్గా తులసీదాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ.లిడియా గ్రేస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ‘రాజమహేంద్రవరం’



ట్రోఫీ అందుకున్న రాజమహేంద్రవరం టీం కెప్టెన్ మూర్తి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్ర ప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్స్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రాజమహేంద్రవరం ఆపరేషన్ సర్కిల్ టీమ్ విజేతగా నిలిచింది. నెల్లూరు వెంకటగిరి గ్రౌండ్స్‌లో ఈనెల 8, 9, 10 తేదీలలో ఈ టోర్నీ జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ టీం.. కెప్టెన్ టీవీఎస్ఎస్ మూర్తి సారథ్యంలో విజయం సాధించింది. శనివారం జరిగిన ఫైనల్‌లో విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ జట్టుపై గెలిచింది. ఏపీ పవర్ సెక్టార్‌లోని ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్‌కు చెందిన 30 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నారు.

దళిత సింహగర్జనకు తరలిరావాలి

కడియం: మండలంలోని వేమగిరి వద్ద ఆదివారం నిర్వహించనున్న దళిత సింహగర్జనకు వేలాదిగా తరలిరావాలని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ పిలుపునిచ్చారు. సభ ప్రాంగణాన్ని శనివారం ఆయన పరిశీలించారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తులు

కంబాలచెరువు: ప్రైవేట్ పాఠశాలల్లో 2024, 25 విద్యాసంవత్సరానికి ఒకటో తరగతి విద్యార్థులకు 25 శాతం సీట్ల కేటాయింపునకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. అనాథలు, హెచ్‌ఐవీ పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన వారికి 6 శాతం సీట్ల కేటాయింపు జరిగిందన్నారు. ఈనెల 23 నుంచి వచ్చేనెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

13న జేగురుపాడులో సబ్‌స్టేషన్ ప్రారంభం

కడియం: జేగురుపాడులో రూ.3.58 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి సిద్ధమైందని గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ తెలిపారు. శనివారం ఆయన ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 13న (మంగళవారం) సబ్‌స్టేషన్ ప్రారంభమవుతుందన్నారు. తద్వారా జేగురుపాడు గ్రామానికి విద్యుత్ సరఫరా ఇబ్బందులు తొలగనున్నాయన్నారు. సబ్ స్టేషన్‌ను మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, నియోజకవర్గ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ భరత్ రామ్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజులకు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

టీటీడీ సహకారంతో ఆలయాల అభివృద్ధి

- 115 దేవాలయాలకు రూ.11.50 కోట్లు మంజూరు
- కమిటీ సభ్యులకు చెక్కులు అందించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



ట్రస్టు సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సహకారంతో నియోజకవర్గంలో పలు ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. ఇందులో భాగంగా 115 దేవాలయాలకు రూ.11.50 కోట్లు మంజూరయ్యాయన్నారు. రాజానగరం మండలంలో 46, కోరుకొండ మండలంలో 38, సీతానగరం మండలంలో 28 ఆలయాలతో పాటు రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని 3 ఆలయాల అభివృద్ధికి వీటికి కేటాయించారన్నారు. టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా విడుదలైన రూ.45.44 లక్షలకు సంబంధించి చెక్కులను ఆయా ఆలయాల ట్రస్టు సభ్యులకు శనివారం అందజేశారు. వీటిలో నామవరంలోని శ్రీకృష్ణుని ఆలయానికి రూ.6.72 లక్షలు, కొత్త తుంగపాడులోని విఘ్నేశ్వరస్వామి ఆలయానికి రూ. 8 లక్షలు, సంపత్ నగరంలోని సీతారామాలయానికి రూ. 8 లక్షలు, వేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ. 8 లక్షలు, కూనవరంలోని శ్రీకృష్ణుని ఆలయానికి రూ.6.72 లక్షల చొప్పున ఆయా కమిటీల సభ్యులకు అందజేశారు.

పంచాయతన పూర్వక సూర్యారాధనకు శ్రీకారం

- నిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలు
- చివరి రోజు 25న భారీ అన్నసమారాధన



పూజలు నిర్వహిస్తున్న కుమార్ శర్మ తదితరులు

సీటీఆర్ఐ: మాఘమాసం సందర్భంగా షోడశ దిన ప్రయుక్త పంచాయతన పూర్వక సూర్యారాధనకు శనివారం శ్రీకారం చుట్టారు. స్థానిక పేపర్ మిల్లు రోడ్డులోని సీతంపేటలోని గల యాగ స్థలంలో నిర్వాహకుడు వడలి కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం కార్యక్రమాలు ఆరంభమయ్యాయి. హోమాది కార్యక్రమాల అనంతరం సూర్యతీర్థ ప్రసాద వితరణ చేశారు. ఇందులో భాగంగా ఈనెల 25 వరకూ ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు సూర్య నమస్కారాలు, హోమాలు, శతచండీ పారాయణ, హోమం, సుదర్శన మంత్రానుష్టానం, హోమం, లక్ష్మీగణపతి జపం, రుద్రాభిషేకం, హోమం, 9 గంటలకు ఉచిత కుంకుమార్చన జరుగుతాయి. 11 గంటలకు సూర్యతీర్థ ప్రసాద వితరణ చేస్తారు. రథసప్తమికి విశేష ఆరాధనలు, 14 నుంచి 18 వరకూ మహాలక్ష్మి ఆరాధన, తామర పువ్వులతో హోమాలు, 13న వరసిద్ధి వినాయక కల్యాణం, 15న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, 17న రమా సమేత వీర వెంకట సత్యనారాయణ స్వామి కల్యాణం, 19న శివ పార్వతుల కల్యాణం, 21న లక్ష్మీనారాయణ కల్యాణం, 23న సూర్య కల్యాణం, 24న జ్యోతిర్లింగార్చన నిర్వహిస్తారు. 25వ తేదీ ఆదివారం మహాపూర్ణాహుతి అనంతరం పదివేలమందికి అన్నసమారాధన జరుగుతుందని కుమార్ శర్మ తెలిపారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ నిరసన



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని నరేంద్రమోదీ బీసీ కాదంటూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అనైతికమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్ ధ్వజమెత్తారు. మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కంబాల చెరువు సెంటర్‌లో రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను దహనం చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతోందన్నారు. కార్యక్రమంలో అడబాల రామకృష్ణ, కందికొండ రమేష్, మన్నెం శ్రీనివాస్, పిల్లాడి రుద్రయ్య పాల్గొన్నారు.

టాస్క్ పేరుతో రూ.27.95 లక్షలకు టోకరా

కంబాలచెరువు: ఇచ్చిన టాస్క్ పూర్తి చేస్తే రెట్టింపు సొమ్ము ఇస్తామని చెప్పిన సంఘటనలో లింగంపేటకు చెందిన ఆర్.అర్జున్ కుమార్ రూ.27.95 లక్షలు పోగొట్టుకున్న సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఈనెల ఒకటో తేదీన అర్జున్ కుమార్‌కు అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. అతడు ఒక టాస్క్ ఇచ్చాడు. దానిని పూర్తిచేసిన అర్జున్‌కు కొంత నగదు వచ్చింది. దీంతో అతడు మరి కొంత నగదు జమ చేశారు. ఈ విధంగా ఈనెల 9వ తేదీ వరకు మొత్తం రూ.27.95 లక్షలు అపరిచిత వ్యక్తి చెబుతున్న విధంగా ఆన్‌లైన్‌లో లావాదేవీ చేస్తూ వచ్చాడు. తర్వాత అపరిచిత వ్యక్తి నుంచి సంభాషణ కట్ అయింది. దీంతో అర్జున్ కుమార్ మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

232 గ్రాముల బంగారం వస్తువుల చోరీ

రాజమహేంద్రవరం రూరల్: తన ఇంట్లోని 232 గ్రాముల బంగారం వస్తువులు చోరీకి గురయ్యాయని బొమ్మూరు జీపీఆర్ రోడ్డుకు చెందిన సజ్జా శ్రీకృష్ణ శనివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సజ్జా శ్రీకృష్ణ వ్యాపారం చేస్తుంటారు. రెండతస్తుల బిల్డింగ్‌లో కింద అద్దెకు ఇచ్చి, పైన ఆయన కుటుంబంతో ఉంటున్నారు. వ్యాపారం నిమిత్తం శ్రీకృష్ణ ఊరికి వెళ్లగా శుక్రవారం రాత్రి ఇంటిలో అతడి తల్లి, కుమార్తె తలుపులు తీసి నిద్రించారు. గుర్తుతెలియని వ్యక్తులు, తల్లి, కుమార్తె నిద్రిస్తున్న బెడ్‌రూమ్ కాకుండా మరో బెడ్‌రూమ్‌లోని బీరువా తెరిచి అందులోని 324 గ్రాముల బంగారం వస్తువులు చోరీ చేశారు. శ్రీకృష్ణ ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఎండీ ఉమర్, క్రైం టీమ్ పరిశీలించింది. క్లూస్‌టీమ్ వేలిముద్రలను సేకరించింది. కేసు దర్యాప్తులో ఉంది.

14న వల్లూరమ్మకు పూజలు

సీతానగరం: వంగలపూడిలో వల్లూరమ్మ తల్లికి ఈనెల 14న ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. ఆ గ్రామ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించి, రుషి పంచమి సందర్భంగా అమ్మవారికి చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు.

ఘనంగా దోసాలమ్మ తీర్థం

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలో కొలువైన దోసాలమ్మ తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కానుకలు సమర్పించుకుని, మొక్కుబడులు చెల్లించుకున్నారు.